అరాచకం ప్రబలితే అవతార పురుషులు పుడతారు

చిరంజీవి నటిస్తున్న క్రేజీ సోషియో ఫాంటసీ ఎంటర్టైనర్ 'విశ్వంభర'. వశిష్ట దర్శకుడు. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మాతలు. సంక్రాంతి కానుకగా జనవరి 10న సినిమా విడుదల కానుంది. గురువారం చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా 'విశ్వంభర' ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'When Myths Collide Legends Rise' అనే కోట్‌తో వున్న ఈ పోస్టర్‌లో చిరంజీవి ఒక రాతిపై కూర్చొని, ప్రత్యేక శక్తులతో కూడిన త్రిశూలాన్ని పట్టుకుని అత్యంత శక్తిమంతంగా కనిపిస్తున్నారు. చిరంజీవి కూర్చున్న కొండ నుంచి వస్తున్న ప్రకాశమంతమైన దైవిక శక్తి, ఉరుములు మెరుపులతో కూడిన వాతావరణం, వాటి మధ్య చిరంజీవి చరిష్మాటిక్ లుక్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. విజువల్ వండర్‌గా ఈ సినిమా ఉండబోతున్నదని ఈ ఫస్ట్‌లుక్ పోస్టర్ చెప్పకనే చెబుతున్నది. తొలి సినిమా 'బింబిసార'తో ప్రయోగాత్మక ఫాంటసీ చిత్రాన్ని తెరకెక్కించి విమర్శకుల ప్రశంసలందుకున్న వశిష్ట అత్యంత ప్రతిష్టాత్మకంగా 'విశ్వంభర'ను తీర్చిదిద్దుతున్నారని మేకర్స్ చెబుతున్నారు. త్రిష, అషికా రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో కునాల్ కపూర్ కీలకమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి కెమెరా: చోటా కె.నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాణం: యూవీ క్రియేషన్స్.

గద్దర్ అవార్డుల కమిటీ ఏర్పాటు

ప్రతి ఏడాదీ ఉత్తమ ప్రతిభ కనపరిచిన చిత్రానికి, సినీ కళాకారులకూ ఇకపై 'గద్దర్' పేరిట అవార్డులు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ దిశగా కార్యాచరణ మొదలైంది. తెలంగాణ ఫిల్మ్ డెవల్‌మెంట్ కార్పొరేషన్ ప్రతిపాదనల మేరకు గద్దర్ అవార్డులకు సంబంధించిన విధివిధానాలు, నియమ నిబంధనలు, లోగోను రూపొందించేందుకు సినీ ప్రముఖులతో ఓ ప్రత్యేక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి, గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక కమిటీ వివరాల్లోకెళ్తే.. సామాజిక చిత్రాల దర్శకుడు, నిర్మాత బి.నరసింగరావుని 'గద్దర్ అవార్డు' కమిటీ అధ్యక్షుడిగా నియమించగా, అగ్ర నిర్మాత దిల్‌రాజుని ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేశారు. అలాగే కమిటీ సలహాదారులుగా దర్శకులు కె.రాఘవేంద్రరావు, ఆర్.నారాయణమూర్తి, అల్లాణి శ్రీధర్, సానా యాదిరెడ్డి, హరీశ్‌శంకర్, నిర్మాత దగ్గుబాటి సురేశ్‌బాబు, గీత రచయిత చంద్రబోస్, సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్‌లతోపాటు బలగం వేణుని నియమించారు. ఇదిలావుంటే.. 'గద్దర్' పేరిట అవార్డులు ఇస్తామని తాము ప్రకటించినా చిత్ర పరిశ్రమ నుంచి ఎలాంటి స్పందన రాలేదని కొన్ని రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీనిపై అగ్ర నటుడు చిరంజీవి తన ఎక్స్ ద్వారా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతిపాదనను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ముందుకెళ్లాలని చిత్ర పరిశ్రమకు ఆయన విజ్ఞప్తి చేశారు. దాంతో ఫిల్మ్ ఛాంబర్, ప్రొడ్యూసర్ కౌన్సిల్ ఈ విషయంపై దృష్టి సారించింది. 'గద్దర్ అవార్డుల'పై తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ)తో చర్చించి, నియమనిబంధనలు, విధివిధానాలను రూపొందించి, ఎఫ్‌డీసీ ద్వారా ప్రభుత్వానికి అందించారు. ఈ నివేదిక ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీని ప్రకటించింది.

ఆ సీన్స్ పొయెటిక్‌గా ఉంటాయి!

తొలి నాళ్లలో విడుదలైన సవ్యసాచి, మిస్టర్ మజ్ను చిత్రాలు పెద్దగా ఆడకపోయినా.. 'ఇస్మార్ట్‌శంకర్'తో బ్లాక్‌బాస్టర్ హిట్ కొట్టేసింది నిధి అగర్వాల్. కౌంట్ కంటే కంటెంట్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ జాగ్రత్తగా సినిమాలు చేస్తున్నది ఈ అందాలనిధి. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ చేతిలో ఉన్న సినిమాలు సామాన్యమైనవి కావు. వాటిలో ఒకటి పవన్‌కల్యాణ్ 'హరిహరవీరమల్లు' కాగా, రెండోది ప్రభాస్ 'రాజా సాబ్'. ఇద్దరు సూపర్‌స్టార్లతో ఒకేటైమ్‌లో జతకట్టి అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నది నిధి అగర్వాల్. ఇటీవల ముంబయ్‌లో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో తన సినిమాల గురించి మాట్లాడింది నిధి. 'పవన్ సార్ 'హరిహరవీరమల్లు'లో రాజుల కాలంనాటి పాత్ర చేస్తున్నా. ఇందులో నా పాత్ర గమ్మత్తుగా, రొమాంటిక్‌గా ఉంటుంది. పవన్‌సార్, నేనూ కలిసి నటించిన సన్నివేశాలు పొయెటిక్‌గా ఉంటాయి. ఓల్డ్ క్లాసిక్స్ చూసిన ఫీల్ కలుగుతుంది. అలాగే.. ప్రభాస్ 'రాజా సాబ్'లో కూడా భిన్నమైన పాత్ర చేస్తున్నాను. ఈ తరహా సినిమా చేయడం ప్రభాస్‌తో పాటు నాకూ కొత్తే. ఏదేమైనా ఇద్దరు సూపర్‌స్టార్లతో కలిసి నటిస్తుండటం చాలా ఆనందంగా ఉంది' అంటూ చెప్పుకొచ్చింది నిధి అగర్వాల్.

సుమంత్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

హీరో సుమంత్ సినిమాల వేగాన్ని పెంచారు. ఆయన కథానాయకుడిగా వారాహి, అనగనగా ఒక రౌడీ చిత్రాలను ఇప్పటికే ప్రకటించారు. ఇదిలావుండగా సుమంత్ తాజా సినిమా బుధవారం లాంఛనంగా ప్రారంభమైంది. కృషి ఎంటర్‌టైన్‌మెంట్స్, ఈటీవీ విన్ సంయుక్తంగా నిర్మించనున్నాయి. సన్నీ కుమార్ దర్శకత్వం వహిస్తారు. వైవిధ్యమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని, సుమంత్ గత చిత్రాలకు భిన్నంగా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఆకట్టుకుంటుందని, ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో తెలియజేస్తామని మేకర్స్ పేర్కొన్నారు. కాజల్ చౌదరి, విహర్ష యడవల్లి తదితరులు ఈ చిత్ర తారాగణం.

తరుణ్‌భాస్కర్ కొత్త చిత్రం

దర్శకుడిగా, నటుడిగా సత్తా చాటుతున్నాడు తరుణ్‌భాస్కర్. ఆయన హీరోగా ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ సంస్థలు ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నాయి. ఏఆర్ సంజీవ్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఈషా రెబ్బా కథానాయికగా నటిస్తున్నది. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. వినూత్న కథాంశంతో తెరకెక్కిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని, తరుణ్‌భాస్కర్ పాత్ర కొత్త పంథాలో ఉంటుందని మేకర్స్ తెలిపారు. బ్రహ్మాజీ, శివన్నారాయణ, గోపరాజు విజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జయ్‌క్రిష్, నిర్మాతలు: సృజన్ యరబోలు, వివేక్ కృష్ణ, సాధిక్, దర్శకత్వం: సంజీవ్ ఏ ఆర్.

హీరోల ఇమేజ్ గురించి పట్టించుకోను

సినిమాల ఎంపికలో తాను హీరోల ఇమేజ్‌కు అంతగా ప్రాధాన్యతనివ్వనని, సవాలుతో కూడిన పాత్రలనే అంగీకరిస్తానని చెప్పింది బాలీవుడ్ అగ్ర కథానాయిక శ్రద్ధాకపూర్. ఆమె నటించిన తాజా చిత్రం 'స్త్రీ-2' బాక్సాఫీస్ వద్ద సంచలనాలను సృష్టిస్తున్నది. ఇప్పటికే 250కోట్ల కలెక్షన్స్‌ను దాటింది. ఈ నేపథ్యంలో ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో సినిమా ఎంపికలో తన ప్రాధాన్యతల గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది శ్రద్ధాకపూర్. సుదీర్ఘ కెరీర్‌లో ఈ భామ ఇప్పటివరకు బాలీవుడ్ ఖాన్‌ల త్రయమైన సల్మాన్‌ఖాన్, అమీర్‌ఖాన్, షారుక్‌ఖాన్ చిత్రాల్లో నటించలేదు. ఇదే విషయమై శ్రద్ధాకపూర్ మాట్లాడుతూ 'ఆ ముగ్గురు అగ్ర హీరోల చిత్రాల్లో చాలా ఆఫర్లొచ్చాయి. అయితే నా పాత్రపరంగా అంత గొప్పగా అనిపించలేదు. ఏవో కొన్ని సన్నివేశాల్లో, పాటల్లో కనిపించే క్యారెక్టర్స్‌ను నేను అస్సలు ఒప్పుకోను. ఎంత పెద్ద హీరో చిత్రమైనా కథా గమనంలో నా పాత్రకు ఇంపార్టెన్స్ ఉండాలి. అప్పుడే అంగీకరిస్తాను' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం తన వద్దకు ఛాలెంజింగ్ రోల్స్ వస్తున్నాయని, భవిష్యత్తులో పెద్ద హీరోలతో గొప్ప కథా చిత్రాల్లో నటించాలనుందని శ్రద్ధాకపూర్ పేర్కొంది.

అమ్మానాన్న సంబరపడి పోతున్నారు

'పట్టణ యువతలో నిజంగా జరుగుతున్న విషయాలను తెరపై చూపించాం. ఈ సినిమా విజయానికి కారణం అదే. నాగచైతన్య అదే మాట అన్నారు. ఎన్టీఆర్, బన్నీ కూడా సినిమా చూసి అభినందించారు. అన్నిటి కంటే సంతోషం అనిపించిన విషయం ఏంటంటే.. మా అమ్మానాన్నకు సినిమాల గురించి పెద్దగా తెలీదు. కానీ ఊళ్లో వాళ్లంతా మా ఇంటికొచ్చి 'మీ అబ్బాయి సినిమా బాగా తీశాడు' అని చెబుతుంటే వాళ్లు తెగ సంబరపడిపోతున్నారు. పొద్దున్నే ఫోన్ చేసి ఆ ఆనందాన్ని నాతో పంచుకున్నారు.' అంటూ దర్శకుడు అంజి కె.మణిపుత్ర ఆనందం వెలిబుచ్చారు. ఆయన దర్శకత్వంలో నార్నె నితిన్, నయన్ సారిక జంటగా నటించిన చిత్రం 'ఆయ్'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 15న విడుదలై థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శింపబడుతున్నదని అంజి కె.మణిపుత్ర ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో ముచ్చటించారు. 'ఇందులోని పాత్రలన్నీ మా ఊర్లో నేను చూసినవే. వాటిని ప్రేరణగా తీసుకొని రాసుకున్నా. హీరోహీరోయిన్లు, ఫ్రెండ్స్.. ఇలా అన్ని పాత్రలూ చక్కగా కుదిరాయి. 'కులం' అనేది సన్సిటీవ్ పాయింటే అయినా.. దాన్ని కామెడీగా డీల్ చేయడం వల్ల పెద్ద ఇబ్బంది రాలేదు. సీరియస్ పాయింట్ అయినా వినోదంతో చెబితే జనాలకు నచ్చుతుందని నా నమ్మకం. నా దగ్గర రెండు కథలున్నాయి. వాటి విషయంలోనూ అదే ఫాలో అవుతా.' అన్నారు అంజి కె.మణిపుత్ర.

'కాంతార' ప్రీక్వెల్ కోసం..

'కాంతార' చిత్రానికిగాను ఇటీవలే జాతీయ ఉత్తమ నటుడు పురస్కారానికి ఎంపికయ్యారు కన్నడ అగ్ర హీరో రిషబ్‌శెట్టి. 'కాంతార' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో 400 కోట్లకు పైగా వసూళ్లను సాధించి రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 'కాంతార' సినిమా ప్రీక్వెల్ సన్నాహాల్లో ఉన్నారు రిషబ్‌శెట్టి. 'కాంతార' మొదటిభాగం ముందు జరిగిన కథతో ఈ ప్రీక్వెల్ తెరకెక్కనుంది. భారీ హంగులతో ఈ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నాడు రిషబ్. యుద్ధ ఘట్టాలు, దక్షిణ కన్నడ ఆధ్యాత్మిక, దైవిక అంశాలతో ఈ సినిమాను ఓ విజువల్ వండర్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఉన్నారు రిషబ్‌శెట్టి. ఈ నేపథ్యంలో రిషబ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ ఆసక్తికరమైన ఫోటోను షేర్ చేశారు. ఇందులో ఆయన కత్తి, డాలు పట్టుకొని కసరత్తులు చేస్తూ కనిపిస్తున్నారు. 'కాంతార' ప్రీక్వెల్ సన్నాహాల్లో భాగంగా ఆయన యుద్ధవిద్యల్లో శిక్షణ తీసుకుంటున్నాడని చిత్రబృందం వెల్లడించింది. హోంబలే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది.

ఇది వింతలోకం..

ప్రియదర్శి, నివేదా థామస్, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం '35 చిన్న కథ కాదు'. నందకిషోర్ ఈమాని దర్శకుడు. గురువారం ఈ చిత్రం నుంచి 'చిన్నా ఇది వింతలోకం..' అనే పాటను విడుదల చేశారు. అందమైన బాల్యాన్ని, పిల్లల్లోని అమాయకత్వాన్ని అందంగా ప్రజెంట్ చేస్తూ ఈ పాట సాగింది. వివేక్‌సాగర్ స్వరపరచిన ఈ గీతాన్ని భరద్వాజ్ గాలి రచించారు. విజయ్‌ప్రకాష్ ఆలపించారు. తిరుపతి నేపథ్యంలో నడిచే ఈ కథలో మధ్యతరగతి తల్లిదండ్రులు, పిల్లల మధ్య అనుబంధాన్ని, సంఘర్షణను హృద్యంగా ఆవిష్కరిస్తున్నామని, స్కూల్ ఎపిసోడ్స్ ప్రత్యేకాకర్షణగా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: నికేత్ బొమ్మి, సంగీతం: వివేక్‌సాగర్, నిర్మాతలు: రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి.

మర్దానీ చాప్టర్ 3కి రంగం సిద్ధం

పదేండ్ల క్రితం రాణి ముఖర్జీ కథానాయికగా యష్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మించిన 'మర్దానీ' చిత్రం ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. సరిగ్గా నాలుగేండ్ల తర్వాత ఈ సినిమాకు సీక్వెల్‌ను రూపొందిస్తే.. ఆ సినిమా కూడా బ్లాక్‌బాస్టర్‌గా నిలిచింది. 'మర్దానీ' ఫ్రాంచైజీకి బోల్డంతమంది ఫ్యాన్స్ ఉన్నారు. అందుకే.. యష్‌రాజ్ ఫిల్మ్స్ ఇప్పుడు 'మర్దానీ' మూడో భాగాన్ని తెరకెక్కించనున్నారు. దీనికి సంబంధించిన వీడియోను మేకర్స్ విడుదల చేశారు. న్యాయం పక్షాన నిలబడి పోరాడే పవర్‌ఫుల్ పోలీస్ అధికారి శివానీ శివాజీరాయ్‌గా రాణిముఖర్జీ నటన విమర్శకుల ప్రశంసలందుకుంది. ఈ మూడో భాగంలో మరింత శక్తిమంతంగా ఆమె పాత్ర ఉంటుందని, ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు త్వరలో తెలియజేస్తామని నిర్మాతలు చెప్పారు.

ఓరి మాయలోడా..

తేజస్ కంచర్ల హీరోగా గ్రామీణ నేపథ్యంలో రూపొందిస్తున్న ప్రేమకథా చిత్రం 'ఉరుకు పటేల'. వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. సెప్టెంబర్ 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల ఈ సినిమా నుంచి 'ఓరి మాయలోడా..' అనే లిరికల్ సాంగ్‌ను అగ్ర కథానాయిక శ్రీలీల విడుదల చేసింది. ప్రవీణ్ లక్కరాజ్ సంగీతాన్నందించిన ఈ పాటను శ్రీనివాసమౌళి రాశారు. స్ఫూర్తి జితేందర్ ఆలపించారు. పల్లెటూరి యువకుడి ప్రేమలో పడిన పట్నం అమ్మాయి తన మనసులోని ప్రేమను వ్యక్తం చేసే సందర్భంలో వచ్చే పాట ఇదని, గ్రామీణ అందాలను ఆవిష్కరించే విజువల్స్‌తో ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు.